## క్లుప్తంగా

### ఎమ్మెల్సీ వంకా ప్రశ్నలకు మంత్రి లిఖితపూర్వక సమాధానం


వంక రవీంద్రనాథ్

భీమవరం: అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలోని మొబైల్ వెటర్నరీ అంబులెన్స్‌పై తానడిగిన ప్రశ్నకు పశుసంవర్ధక శాఖామంత్రి కింజరాపు అచ్చెంనాయుడు లిఖితపూర్వకంగా సమాధానం పంపించారని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ శనివారం చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా మొబైల్ వెటర్నరీ అంబులెన్స్ 340 ఉన్నాయని వాటి మెయింటనెన్స్ కోసం గత ఏడాది జూన్ వరకు రూ. 49.48 కోట్లు చెల్లించగా ఈఏడాది అక్టోబర్ వరకు రూ. 87.74 కోట్లు చెల్లించాల్సి ఉందని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు.

### కులగణన సమగ్రంగా నిర్వహించాలి

భీమవరం: జనగణనలో కులగణన సమగ్రంగా నిర్వహించాలని బీసీ చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం భీమవరంలోని సర్దార్ గౌతులచ్చన్న కమ్యూనిటీహాల్లో నిర్వహించిన బీసీ చైతన్యవేదిక జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఏడాది నిర్వహించే కులగణన సమగ్రంగా జరగాలని, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్స్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం చైతన్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా గుబ్బల నాగరాజును నియమించారు. ఈ సమావేశంలో వేదిక రాష్ట్ర కార్యదర్శి అరిటికట్ల త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు ప్రింటర్ బహూకరణ

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు పట్టణంలోని మెంటేవారితోటలోని వండర్‌కిడ్స్ స్కూల్ రూ. 30 వేలు విలువచేసే ప్రింటర్, జిరాక్స్ మిషన్‌ను శనివారం అందజేశారు. పోలీసుస్టేషన్‌లో ఏఎస్పీ వి భీమారావు మిషన్ అందుకుని మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలు ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఆర్‌జి జయసూర్య, సీఐ ఎం నాగరాజు, ఎస్ఐ కిరణ్ కుమార్, స్కూల్ చైర్మన్ అల్లు రామకృష్ణ, అల్లు వనజాక్షికుమారి, వంశీకృష్ణ, విజయభాగ్యశ్రీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం

భీమవరం: ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని, క్రిస్మస్ పండుగతో ప్రతి ఇంటా శాంతి సౌభాగ్యాలు నెలకొనాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం ఆర్‌సీఎం చర్చ్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ఐపీఏఎఫ్‌ఎఫ్‌సీ దైవజనుల ఐక్య క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రేమ భావాన్ని, సేవతత్పరతను, క్షమాగుణాన్ని బోధించిన క్రీస్తు జన్మదినం క్రైస్తవులకు అత్యంత ప్రీతికరమైన రోజన్నారు. ఈ కార్యక్రమంలో పీటార్ పుత్త, ఐజాక్ పాల్, స్టాన్లీ థామస్, పిటి వర్గీస్, సువార్త రాజు, చిరంజీవి, చెరుకువాడ డేవిడ్‌రాజు, జార్జి తదితరులు పాల్గొన్నారు.

### మానవత సేవలు అభినందనీయం

భీమవరం: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న రెండు కుటుంబాలకు శనివారం బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహనవర్మ, చైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు మాట్లాడుతూ మానవత సంస్థ ఆధ్వర్యంలో ప్రతినెలా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని దీనిలో భాగంగా తాడేరు రోడ్‌లోని ఇందిరమ్మ కాలనీకి చెందిన శీలం పైడియ్య, వీరవల్లి సత్యనారాయణలకు సహాయం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ అల్లు శ్రీనివాస్, కో చైర్మన్ కార్మూరి నర్సింహమూర్తి, ఇందుకూరి శివాజీ వర్మ, పెన్మెత్స సత్యనారాయణరాజు, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# సంక్షోభంలో ఆక్వా హబ్


చెరువులో ఆక్సిజన్ పెంచేందుకు ఆయిల్ ఇంజిన్ బోటు తిప్పుతున్న దృశ్యం


పట్టుబడికి వచ్చిన చేపలు

- మందగించిన చేప ఎదుగుదల
- చలి తీవ్రతతో కొట్టుకుంటున్న చేప
- భారీ పెట్టుబడులతో రైతులు

భీమవరం అర్బన్: ఆక్వా హబ్‌గా పేరుగాంచిన భీమవరం వాతావరణ మార్పులతో సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంది. దీంతో రైతులు చెరువులలో చేపను రక్షించేందుకు ఇంజిన్ బోట్లు, ఆక్సిజన్ మందులు వాడుతున్నారు. కోట్లాది రూపాయలు విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించే ఆక్వా రైతులు చేప ఎదుగుదల మందగించడంతో ఆందోళన చెందుతున్నారు. భీమవరం నియోజకవర్గంలో దెయ్యాల తిప్ప, లోసరి, కొత్తపూసలమర్రు, వెంప, గూట్లపాడు, దొంగపిండి, తోకతిప్ప, నాగిడిపాలెం, వీరవల్లిపాలెం, రాయకుదురు, వడ్డిగూడెం తదితర గ్రామాలలో సుమారు 24 వేల ఎకరాలలో చేపలు సాగు, 12 వేల ఎకరాలలో వనామీ రొయ్యల సాగు చేస్తున్నారు. ముఖ్యంగా శీలావతి, కట్ల, ఫంగస్, రూప్‌చంద్, తిలాఫీ, గడ్డిచేప తదితర సప్పనీటి చేపలను పెంచుతున్నారు. రోజుకు చేప సుమారు 300 టన్నులు కలకత్తా, బెంగాల్, మహారాష్ట్ర, ఒడిస్సా తదితర ప్రాంతాలకు ఎగుమతులు జరుగుతున్నాయి. దీంతో కోట్లాది రూపాయలు విదేశీ మారకద్రవ్యం నియోజకవర్గానికి చేరుకుంటుంది. ఈ ఏడాది జనవరి నుంచి చేపలకు మార్కెట్‌లో సరియైన గిరాకి లేకపోవడం, అధిక వర్షాలు పడటంతో పుంతరోడ్లు ధ్వంసం కావడంతో చేపల చెరువుల వద్దకు మేత లారీలు, పట్టుబడి లారీలు రాకపోకలు లేకపోవడంతో తీవ్ర నష్టాలను చవి చూశామని రైతులు చెబుతున్నారు.

**మందగించిన చేప ఎదుగుదల**

చలి తీవ్రత ఎక్కువగా ఉండి పగలు ఎండ కాసి వాతావరణ మార్పులతో చేపలు చెరువులలో ఆక్సిజన్ శాతాల్లో హెచ్చుతగ్గులు, పీహెచ్ మార్పులు, అమ్మోనియా పెరగడంతో చేపలు మేతలు తినకపోవడంతో ఎదుగుదల మందగిస్తుందని రైతులు చెబుతున్నారు. దీంతో చేపకు మేతగా పెట్టే డీఓపీ తవుడు సైతం తినడం లేదని వాపోతున్నారు. అంతేకాకుండా చేపలకు తాటాకు, మొప్ప తెగులు, పేను పట్టడం వంటి వ్యాధులు వస్తాయని రైతులు చెబుతున్నారు.

**చలి తీవ్రతకు మృత్యువాత పడుతున్న చేపలు**

గత రెండు వారాలుగా రాత్రులు చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో చెరువుల్లో నీరు చల్లదనం ఎక్కువై చేపలకు తెగులు వ్యాప్తి చెంది మృత్యువాత పడుతున్నాయని రైతులు చెబుతున్నారు. దీనిని నివారించేందుకు ఆక్సిజన్ శాతాల్లో హెచ్చుతగ్గులు నివారించేందుకు నిరంతరం ఇంజిన్ బోట్లు తిప్పుతూ, పీహెచ్, అమ్మోనియాలకు మందులు కొడుతూ చేపలను రక్షించుకుంటున్నామంటున్నారు.

**భారీ పెట్టుబడులతో సాగు**

ఒక ఎకరం చేపల సాగు చేసేందుకు సుమారు రూ. 3 నుంచి 4 లక్షలు వరకు ఖర్చువుతుందని రైతులు చెబుతున్నారు. చేపల సాగు చేయాలంటే 20 ఎకరాలు పైగా చేపలు చెరువు ఉండాలని వెల్లడిస్తున్నారు. చేపలకు మేతలుగా డీఓపీ తవుడు, చెక్క, పత్తిపిండి, పిల్లేట్స్ వేస్తుంటారు. చేపకు పెట్టే మేతను బట్టీ 7 నుంచి 9 నెలల్లో కేజీ చేప తయారవుతుందని చెబుతున్నారు. చేప ఎదుగుదల మందగిస్తే చివరకు అప్పులు మిగులుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

> **ఆక్సిజన్ నియంత్రించేందుకు నానా కష్టాలు**
>
> వాతావరణ మార్పులు రావడంతో చెరువుల్లోని ఆక్సిజన్ శాతంలోని హెచ్చుతగ్గులు నియంత్రించేందుకు ఇంజన్ బోట్లను తిప్పుతున్నాం. చెరువులు వద్దే పడిగాపులు కాస్తున్నాం. కూలీల రేట్లు, మేత ఖర్చులు పెరిగిపోయాయి. ఇన్ని కష్టాలు పడినా చేపకు సరియైన మార్కెట్ ధర ఉండటం లేదు. చేప మార్కెట్ ధరలను పెంచి రైతులను ఆదుకోవాలి.
>
> రేవు గోవిందరాజు, ఆక్వారైతు, దొంగపిండి

### మధ్యవర్తిత్వంపై అవగాహన అవసరం

భీమవరం: మండల న్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మూడో అదనపు జిల్లా జడ్జి ఎంఎ సోమశేఖర్ న్యాయవాదులకు మధ్యవర్తిత్వ ప్రాధాన్యత, ఏఏ కేసుల్లో మధ్యవర్తిత్వం చేయాలి? వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి సురేష్‌బాబు, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అడపాల ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### యమునాపల్లిలో ఎక్సైజ్ దాడులు

భీమవరం: మండలం యమునాపల్లి గ్రామంలో ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. బెల్ట్ షాపు నిర్వహిస్తున్న గంటా శ్రీనును అరెస్టు చేసినట్లు సీఐ రామరాజు చెప్పారు. నిందితుడి నుంచి 7 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

### తలపై గాయపర్చాడంటూ ఫిర్యాదు

భీమవరం: బీరుబాటిల్‌తో తలపై గాయపర్చాడంటూ పట్టణంలోని నాచువారిసెంటర్‌కు చెందిన ఎ వాసు ఫిర్యాదు చేసినట్లు వన్‌టౌన్ ఏఎస్ఐ కోళ్ల శ్రీను శనివారం చెప్పారు. వివరాల ప్రకారం శుక్రవారం వాసు తన స్నేహితులతో కలసి బేతనిపేటలో క్రికెట్ ఆడుతుండగా ఆప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు గొడవపడుతుండగా అక్కడకు వెళ్లడంతో సీహెచ్ సాయితేజ నువ్వెందుకు వచ్చావంటూ చేతిలో ఉన్న బీరు బాటిల్‌తో గాయపర్చారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

# సైనికుల సేవలు మరువలేనివి


భీమవరంలో సాయుధ దళాల జెండా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


సాయిధ దళాల సంక్షేమ నిధికి విరాళాలు సేకరిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

భీమవరం: డీఎన్నార్ కళాశాల సీనియర్ డివిజన్ ఎన్‌సీసీ కాడెట్స్ ఆధ్వర్యంలో శనివారం సాయుధ దళాల జెండా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వీధులగుండా జన చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో జన సంచారం సాధ్యం కాని ప్రదేశాల్లో, ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పహరా కాస్తూ దేశాన్ని రక్షిస్తున్న ఎందరో సైనికుల సేవలు మరువలేనివన్నారు. ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు మాట్లాడుతూ దేశ ప్రజల శ్రేయస్సుకోసం నిరంతరం శ్రమిస్తున్న సైనిక సంక్షేమ నిధికి ప్రజలందరూ విరాళాలివ్వాలన్నారు. కార్యక్రమంలో కళాశాల పాలక వర్గ సభ్యుడు పి రామకృష్ణంరాజు, ప్రిన్సిపల్ జి మోజేస్, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎ వీరయ్య, వైస్ ప్రిన్సిపల్ సీహెచ్‌జె సోమరాజు, కళాశాల సీనియర్ కాడెట్లు బి లీలా శంకర్, పి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

**సాయుధ దళాల సేవలు ఎనలేనివి**

భీమవరం (ప్రకాశంచౌక్):సరిహద్దుల్లో జన సంచారం సాధ్యం కాని ప్రదేశాలలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పహరా కాస్తూ దేశాన్ని రక్షిస్తున్న ఎందరో సైనికుల సేవలు వెలకట్టలేనివని జనసేన రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి వబిలిశెట్టి రామకృష్ణ అన్నారు. భారత సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ రంగసాయి, ఎన్‌సీసీ మేజర్ ఎ.వీరయ్య సారథ్యంలో పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఎన్‌సీసీ క్యాడేట్లతో సైనిక సంక్షేమ నిధి విరాళాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ యుద్ధంలో గాయపడి ఉద్యోగాలు కోల్పోయిన లేదా మరణించిన వారి కుటుంబాలకు సైనిక సంక్షేమ నిధి ద్వారా సహాయం అందుతుందన్నారు. మేజర్ వీరయ్య, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ విధి నిర్వహణలో దేశ రక్షణకు త్రివిధ దళాల సేవలు అమూల్యమైనవని తెలిపారు. ఈ కార్యక్రమంలో కారుమూరి సత్యనారాయణ మూర్తి, వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు బోండా శ్రీరామ్, వరలక్ష్మి మెడికల్స్ మామిడిపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండాలి

భీమవరం: విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని భీమవరం ఎక్సైజ్ సీఐ కె బలరామరాజు అన్నారు. పట్టణంలోని ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎం స్కూల్లో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవించడం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండడంతో పాటు వాటివల్ల కలిగే నష్టాలను ఇతరులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు పీవీవీఎస్ ఉమామహేశ్వరరావు, పి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**మాదకద్రవ్యాల నివారణపై అవగాహన**

ఆకివీడు: మాదక ద్రవ్యాలను స్వీకరించడం వల్ల ఇల్లు, ఒళ్లు గుల్ల అవుతుందని, ప్రాణాలను పోగొట్టే వ్యసనాల్ని మానాలని ఎక్సైజ్ ఎస్సై కరుణప్రియ పిలుపునిచ్చారు. మండలంలోని పెద ఉప్పరగూడెం గ్రామంలోని పాఠశాల వద్ద శనివారం గ్రామస్తులతో మాదకద్రవ్యాల వినియోగాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం, మత్తు మందులు ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తాయన్నారు. హెచ్ఎం కె.శివాని మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని కోరారు.

# ఘనంగా షష్ఠి మహోత్సవాలు

భీమవరం(ప్రకాశంచౌక్): పట్టణంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలు పలు దేవాలయాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. భీమవరం శ్రీరామపురంలో శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ నాగరాణి రామలింగేశ్వర దేవస్థానంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భీమేశ్వరస్వామి ఆలయంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం శనివారం తెల్లవారుజామున కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. పంచారామక్షేత్రంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి, కుమార స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవోలు తోట శ్రీనివాస్, కేఆర్‌కే రాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


భీమవరం (ప్రకాశం చౌక్): పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ నాగరాణి


ఉండి: శివాలయంలో సుబ్రహ్మణ్యేశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు

**ఘనంగా షష్ఠి మహోత్సవాలు**

వీరవాసరం: మండలంలోని వల్లీ దేవసేన సహిత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాలు శనివారం మండల వ్యాప్తంగా అన్ని సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లోను ఘనంగా జరిగాయి. వీరవాసరం, తోకలపూడి, తోలేరు, రాయకుదురు, మత్స్యపురి, కొణితివాడ, మత్స్యపురిపాలెం, నడపనవారి పాలెం తదితర గ్రామాలల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు తెల్లవారుజాము నుంచి క్యూలైన్‌లో పాల్గొని స్వామి వారిని దర్శించారు. ఆలయ ప్రాంగాణాలు వద్ద అన్న సమారాధనలు నిర్వహించారు. మేళా తాళాలతో బాణా సంచా కాల్పులతో వివిధ వేషధారణలతో స్వామి వారి గ్రామోత్సవం జరిగింది.

**ఆకివీడులో..**

ఆకివీడు: స్థానిక ఆనాల చెరువు గట్టు వద్ద ఉన్న వల్లీ దేవ సేన సమేత కల్యాణ సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి ఉత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో క్యూలో నిలబడి సుబ్రహ్మణ్యేశ్వరుడిని దర్శించుకున్నారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు చేశారు. షష్ఠి ఉత్సవంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక దుకాణాలు ఆకట్టుకున్నాయి. అలాగే సాయంత్రం ఆలయం వద్ద ఉన్న ఆనాల చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన హంసవాహనంలో ఉంచి తెప్పోత్సవం చేశారు. బాణసంచా కాల్చి తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నేరెళ్ల రామకృష్ణ, మోరా జ్యోతి శ్రీనివాసరెడ్డి, మన్నే పోతరాజు, కిమిడి నాగరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్లు మోటుపల్లి గంగాధరరావు, వానపల్లి బాబూరావు, మోటుపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**ఉండిలో..**

ఉండి: సుబ్రహ్మణ్యేశ్వరుని షష్ఠి పండుగను పురస్కరించుకుని మండలంలోని అన్ని సుబ్రహ్మణ్యుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి భక్తులు ఆలయాలకు చేరుకుని సుబ్రహ్మణ్యేశ్వరునికి పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకాలు, అష్టోత్తర శతనామ పూజ, నీరాజన మంత్ర పుష్పములు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సన్నిధిరాజు శేషగిరి, సన్నిధిరాజు కృష్ణ, సన్నిధిరాజు చలపతి తదితర అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.


వీరవాసరం: సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం


ఆకివీడు: ఆనాల చెరువు షష్ఠి ఉత్సవంలో సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


ఆకివీడు: సుబ్రహ్మణ్యుని షష్ఠి తీర్థంలో భక్తుల రద్దీ

# విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి

భీమవరం అర్బన్: ప్రతి విద్యార్థిలోను ఏదో ఒక ప్రతిభ ఉంటుందని దానిని గుర్తించి ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఆర్డీవో ప్రవీణ్‌కుమార్ రెడ్డి అన్నారు. భీమవరం మండలంలోని చినఅమిరం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం జరిగిన పేరేంట్స్, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహణను పరిశీలించారు. ముందుగా విద్యార్థులు ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆర్డీవో ప్రవీణ్‌కుమార్ రెడ్డి గ్రంథాలయం సందర్శించి పలు పుస్తకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో ప్రవీణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోను ఏదో ఒక ప్రతిభ ఉంటుందని ఒక్క చదువు మాత్రమే కాదని ఆ ప్రతిభను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వెలికి తీసి ప్రోత్సహించాలన్నారు. ఎంతోమంది విద్యార్థులు పదో తరగతి పూర్తయ్యాక తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారన్నారు. విద్యార్థులు కష్టపడి ఇష్టంతో చదవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పలు క్రీడల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మురళీ గంగాధరరావు, ప్రధానోపాధ్యాయురాలు వేగేశ్న అనురాధ, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణంరాజు, పేరేంట్స్ కమిటీ చైర్మన్ సంజీవ్ రెడి ఉన్నారు.


చినఅమిరం హైస్కూల్లో గ్రంథాలయంలో ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

**క్షేత్రస్థాయి పరిశీలనకే ఆత్మీయ సమావేశాలు**

ఆకివీడు: పాఠశాల క్షేత్రస్థాయి పరిశీలన కోసమే ఆత్మీయ సమావేశాల్ని నిర్వహించినట్లు నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణ మోహన్ చెప్పారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. తొలుత విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుడితో వారి సామర్థ్యాన్ని తెలియజేస్తూ చర్చాగోష్టి నిర్వహించారు. అనంతరం తల్లులతో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పెదకాపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఓఎస్‌డీ వెంకట కృష్ణారావు పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రుల బాధ్యతను వివరించారు.

**మత్తుతో జీవితం చిత్తు**

ఉండి: మత్తు మందులు జీవితాన్ని చిత్తు చేస్తాయని జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు అన్నారు. శనివారం మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోను పేరెంట్స్ టీచర్స్ మీట్ (పీటీఎం) సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెరుకువాడ జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ చదువుకోడం అనేది దేవుడు మనకిచ్చిన వరం అని అందుకే అందరూ శ్రద్దగా,గొప్పగా చదవాలని అన్నారు. ఆర్‌బీఎస్‌కే పీఓ డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ స్కూల్స్‌లో ఎవరైనా మత్తు మందులు సేవించినట్లు తెలిస్తే 1972 నంబర్‌కు కాల్ చేసి చెప్పాలని లేదా స్థానిక స్కూల్ హెచ్‌ఎంకు తెలియచేయాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయం చేసుకుని ముందుకు వెళితే విద్యార్థుల జీవితాల్లో చదువులు మరింత గొప్పగా సాగుతాయని తెలిపారు. ఉండిలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ ఎస్.రవీంద్ర, తహసీల్దార్ కె.నాగార్జున, ఎస్సై ఎండీ నసీరుల్లా తదితరులు పాల్గొని సైబర్ నేరాలు తదితర విషయాలపై విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి బి.సాయిచంద్ర, సీహెచ్‌ఓ ఆర్.కృష్ణకుమార్, హెచ్‌ఎం పార్వతీదేవి పాల్గొన్నారు.

**విద్యాభివృద్ధికి పాటు పడాలి**

వీరవాసరం:విద్యాభ్యాసం సమయంలో ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని ఎంఈఓ శ్రీమన్నారాయణ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.సుజాత రాణిలు తెలిపారు. వీరవాసరం మండలంలోని రాయకుదురు, కొణితివాడ, తోలేరు, మత్స్యపురి, అండలూరులోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలలోను, ఎంపీపీ యూపీ స్కూల్స్‌లో శనివారం మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కానుకొలను శ్రీనివాసరావు, యాజమాన్య కమిటీ ఛైర్మన్ శలా భవాని, వైస్ చైర్మన్ పంజా దుర్గా వెంకట గణేష్, కో ఆప్టెడ్ సభ్యులు కడలి వాసు, పి.సాయిబాబా తదితరులు మాట్లాడారు. విద్యార్థులకు సమగ్ర ప్రగతి నివేదికలు అందించారు. వీరవాసరం ఏఎస్ఐ సత్యనారాయణ సైబర్ నేరాలు ఏ విధంగా అరికట్టాలో? వంటి అంశాలపై అవగాహన కల్పించారు.